వేదాంతభేరి

జనవరి 2020

రూ. 10/-

Scanned by CamScanner



ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 జనవరి 2020 సంచిక : 01

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

Scanned by CamScanner

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 జనవరి 2020 సంచిక : 01

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. మాలిన్యము– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు -06
03. మకర సంక్రాన్తి – శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు - 09
04. సద్గురు వాణి – శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -10
05. శ్రీరామకృష్ణ ఉవాచ – శ్రీరామకృష్ణ పరమహంస -11
06. సాధన పంచకము – శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు -12
07. సంఘ సంస్కరణ దీక్షాదక్షులు– కందుకూరి, మలయాళస్వామి - 16
– డా॥ సముద్రాల లక్షణయ్య
08. ఉద్ధవ గీత – శ్రీ యేలేశ్వరపు హనుమ రామకృష్ణ - 22
09. ధ్యానము – శ్రీ ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 29
10. కలగన్న సౌభాగ్యం –కైవల్య వైభోగం– డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ - 34
11. ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము - 39
12. ఎత్తిపాడుము –కంఠము ఎత్తిపాడు - 40
13. నేనెరిగిన శ్రీరమణ భగవాన్ – డా॥కె.సుబ్రమణియన్ - 41
14. వార్తలు - 42

ముఖచిత్రం – వేదాన్తకేసరి స్వామి వివేకానన్ద

జనవరి 1వ తేది బుధవారం ఆంగ్ల సంవత్సరాది

జనవరి 2వ తేది రమణ మహర్షి జయన్తి

జనవరి 6వ తేది వైకుంఠ ఏకాదశి – ముక్కోటి ఏకాదశి

జనవరి 12వతేది స్వామి వివేకానన్ద జయన్తి. జనవరి 15వ తేది మకర సంక్రాన్తి

జనవరి 25వ తేది మాఘ మాస ప్రారంభ దినోత్సవం

జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవం. 30వ తేది మహాత్మాగాంధీ వర్థన్తి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

1. ఓం నమః సవిత్రే జగదేకచక్షుషే, జగత్ప్రసూతి స్థితినాశహేతవే ।
త్రయీమయాయ త్రిగుణాత్మధారిణే, విరించి నారాయణ శంకరాత్మనే ॥

తా ॥ జగత్తుకు నేత్రాలు, ప్రపంచ సృష్టిస్థితిలయాలకు కారణభూతులు, వేద స్వరూపులు, త్రిగుణ స్వరూపులు, బ్రహ్మవిష్ణు శివరూపులగు సూర్య భగవానునకు నమస్కారము.

2. ఓం ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర !
దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే ॥

తా ॥ ఆదిదేవా! నీకు నమస్కారము ఓ భాస్కరా! అనుగ్రహింపుము. దివాకరా! నీకు నమస్కారము, ప్రభాకరా! నీకు నమస్కారము అగుగాక!

3. ఓం శ్రీవిష్ణుం జగతాంనాథం జ్ఞానవిజ్ఞావమోక్షదమ్ ।
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

తా ॥ శ్రీ విష్ణువు, జగత్తుకు ప్రభువు, జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని,మోక్షాన్ని ఇచ్చేవాడు, మహాపాపాన్ని హరించేవాడుయగు సూర్యుని నేను ప్రణమిల్లుచున్నాను.

4. ఓం విశ్వేశం విశ్వ కర్తారం మహాతేజః ప్రదీపనమ్ ।
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

తా ॥ విశ్వానికి ఈశ్వరుడు, విశ్వకర్త, మహాతేజస్సును దీప్తిమంతం చేయువాడు, మహాపాపాన్ని హరించేవాడు నగు సూర్యుని నేను ప్రణమిల్లుచున్నాను.

5. ఓం భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః, భద్రం పశ్యేమాక్షిభి
ర్యజత్రాః । స్థిరైరంగైస్తుష్టువాగ్ంస స్తనూభిః, వ్యశేమ
దేవహితం యదాయుః । స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తి నః
పూషా విశ్వవేదాః । స్వస్తి న స్తార్క్ష్యో అరిష్టనేమిః, స్వస్తి నో
బృహస్పతిర్దధాతు । ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

తా ॥ దేవతలారా! మా చెవులతో మేము మంచినే విందుముగాక! మా కనులతో మేము మంచినే చూతుము గాక! మాకు దేవతలు నిర్దేశించిన ఆయువు వున్నంతవరకు మిమ్మల్ని స్తుతిస్తూ ఆరోగ్యవంతులమౌతూ,శక్తిమంతులమౌతూ జీవింతుముగాక! పురాతనుడై ప్రసిద్ధిచెందిన ఇంద్రుడు, లోకచక్షువై సర్వమూ తెలిసిన (సర్వజ్ఞుడు అయిన) సూర్యుడు, అరిష్టనాశకుడైన వాయువు, ఆత్మవిద్యను అనుగ్రహించు బృహస్పతియును మాకు శుభాలను చేకూర్చుదురుగాక! ఓం శాన్తిః,.. శాన్తిః, శాన్తిః

Scanned by CamScanner

మాలిన్యము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మురికిని, మాలిన్యమును ఎవరును సహింపరు. దానిని వహించుటకు ఎవరును ఇష్టపడరు. బయటగాని, లోనగాని మురికి ఉన్నదని తెలిసినచో వెంటనే దానిని తొలగించివేయుదురు. ప్రతిదినము ప్రతివారు ఉదయము నిద్రలేవగనే వారివారి ఇండ్లను ఊడ్చుకొని చెత్తచెదారమును పారవేసి శుభ్రపఱచుకొందురు గదా! అట్లే ఒంటిలోగల మురికిని నిత్యకృత్యముల ద్వారా, స్నానాదుల ద్వారా తొలగించి వేయుచుందురు గదా! ఆ ప్రకారము ఎందుకు చేయవలెను? మురికి అనారోగ్యమని వారికి తెలియును కాబట్టి. మురికి దేహమునకు అపకారము కలుగజేయునను సత్యము సర్వులకును విదితమైయున్నది. కాబట్టి దానినెవరును దరికిజేర్చరు. చేర్చుటకు ఇష్టపడరు.

అట్లే మనస్సునందును కశ్మలము కలదు. అది ఇప్పటిది కాదు. ఎన్ని జన్మలనుండియో జీవుని వెంటాడుచు వచ్చుచున్నది. బహుకాలము నుండియు అది చిత్తమున రూఢిపడి వేళ్ళుపాతుకొనియున్నది.

గీతాచార్యుడు చెప్పినట్లు అది 'సువిరూఢముగ' వర్తించుచున్నది. ఆ కశ్మలమును తొలగించుటయే జీవుడు చేయువలసిన పని. ఆ మురికిని శీఘ్రాతి శీఘ్రముగ దూరీకరించుటయే జీవుని కర్తవ్యము.

ప్రతివానికి రెండు దేహములు కలవు. స్థూలదేహము, సూక్ష్మదేహము అని. స్థూలదేహము యొక్క ఆరోగ్యము విషయమై అందఱును జాగరూకులై యున్నారు. మురికి అంటినచో శుభ్రపఱచుటగాని,రోగమువచ్చినచో చికిత్స

చేయుటగాని ప్రతివారును ఆచరించుచునేయున్నారు. ఇంతమాత్రముతో వారి పని పూర్తికాలేదు.

సూక్ష్మదేహముయొక్క ఆరోగ్యవిషయమై కూడ జాగరూకత వహింప వలయును. మనస్సు యొక్క శుభ్రతను గూడ కాపాడుకొనుచుండవలెను. దానియందు కశ్మలము చేరియున్నది. దానిని ఉపేక్ష చేయరాదు. పెద్దలవలన, సద్గురువుల వలన, శాస్త్రములవలన దాని ఉనికిని తెలిసికొని, దాని నివారణ పద్ధతులను కనుగొని, వెంటనే దానికి ఉద్వాసనము కల్పించవలెను. సకాలమునకు రోగమును కనిపెట్టి చికిత్స కావించనిచో క్రమక్రమముగ అది బలపడి మనుజునకెట్లు అపారమగు హాని కలుగజేయునో అట్లే మనస్సునందలి కశ్మలమును గూర్చియు సకాలమున యోచించనిచో, తొలగించుటకు యత్నించనిచో జీవునకు ఘోరమైన ఆపత్తును కలుగజేయగలదు. కనుకనే శ్రీకృష్ణపరమాత్మ గీతాబోధకు ఉపక్రమించిన వెనువెంటనే ఈ కశ్మలమును గూర్చి ప్రస్తావించెను.

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్

'ఓ అర్జునా ! ఈ మహావిషమ సమయమందు ఈ కశ్మలము (మోహము) నీకెచటనుండి దాపురించినది?, – అని గీతాచార్యుడు అర్జునుని ప్రశ్నించెను. మనస్సునందలి కశ్మలము మహాప్రమాదకరమైనది కాబట్టియే సర్వజ్ఞుడైన పరమాత్మ దానిని గూర్చి తొలుదొల్తనే ప్రస్తావించుటయు, దాని నివారణకై ఉపాయములను సెలవిచ్చుటయు జరిగినది.

జీవుడు వాస్తవముగ నిర్మలస్వరూపుడు. నిత్యశుద్ధబుద్ధ చిదాత్మయే అతడు. అతనియందు కశ్మలము ఆగంతుకమైనదే కాని స్వతస్సిద్ధముకాదు. మహాత్ముల దివ్యప్రబోధముచే అద్దానిని తొలగించివైచి అతడు తన సహజ

Scanned by CamScanner

నిర్మల స్వభావమును తిరిగి పొందవలెను. కాబట్టి సాధకుడు అనేక జన్మార్జితమైన వాసనాపంకిలమును పోగొట్టుకొనుటకు ప్రయత్నము చేయుట, తాను సచ్చిదానంద స్వరూపమగు ఆత్మయే కాని దేహాది దృశ్యపదార్థము కాదని పదేపదే చింతనజేయుట -అను ఈ రెండు సాధనలను గావించు చుండవలెను.

మొదటి సాధన వాసనాక్షయమని, రెండవ సాధన తత్త్వజ్ఞాన మనియు పేర్కొనబడుచుండును. తత్త్వజ్ఞానము యొక్క సహాయముచే అనగా దృశ్య వస్తువులు నశ్వరములనియు, ఆత్మ శాశ్వతమనియు, తాను ఆత్మయేకాని దేహాది దృశ్యపదార్థము కాదనియు, నిరంతరము చింతన జేయుటచేత మనస్సు నందలి వాసనలు- జన్మాంతర కశ్మలము క్షయింప, అనగా వాసనాక్షయము కాగా, మనోనాశము దానంతటదియే సిద్ధించును.

ఎప్పుడు మనస్సు లయించునో అప్పుడు జీవుడు స్వస్వరూప ఆత్మస్థితి యందు నిలుకడ కలిగియుండును. అదియే మోక్షము.

కాబట్టి విచారణ ద్వారా మొట్టమొదట జీవుడు తనయందు బహుకాలమునుండి జీర్ణించియున్న కశ్మలమును, దోషమును, మురికిని తెలిసికొని దానిని ప్రయత్నపూర్వకముగ తొలగించుకొని తిరిగి దానిని దరికి చేర్చకుండ చూడవలయును. ఈ ప్రకారముగ భవరోగమును బాపుకొని పూర్ణారోగ్యవంతుడు కావలెను. ఆరోగ్యమే మహాభాగ్యమని మఱువరాదు.

శరీరారోగ్యము, మానసికారోగ్యము రెండును బడసినప్పుడే జీవుడు రోగ రహితుడై, నిత్యనిరంజన ఆత్మస్వరూపుడై వెలయగలడు. అట్టి ఆత్మరూప పరమానందానుభూతియే జీవితము యొక్క పరమలక్ష్యము!

మకర సంక్రాన్తి

- శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

"రవేః సంక్రమణం రాశౌ సంక్రాన్తిరితి కథ్యతే" అని స్కంద పురాణంలో చెప్పినట్లు సూర్యుడు ఒకరాశి నుండి మరోరాశిలో ప్రవేశించే సమయాన్ని సంక్రాన్తి అంటారు. సూర్యుడు పన్నెండు రాశులలోను ప్రవేశిస్తాడు. కాబట్టి సంవత్సరానికి 12 సంక్రాన్తులు ఏర్పడుతాయి. అయితే ఇందులో మన దేశంలో అందరూ పండుగగా కొలిచేది మరక సంక్రాన్తినే. కాబట్టి సంక్రాన్తి అంటే మకర సంక్రాన్తే.

"మకర కర్కటక సంక్రాన్తి క్రమేణోత్తరాయణం దక్షిణాయనం స్యాత్" అని ముక్త సంగ్రహంలో చెప్పినట్లు మకర సంక్రాన్తి నుంచి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. కాబట్టి మకర సంక్రాన్తికి విశేష ప్రాధాన్యత ఏర్పడింది.

ఈ సంవత్సరం (మకర) సంక్రాన్తి పుష్యమాసంలో వస్తుంది. అంటే 2020 సంవత్సరం జనవరి 15వ తేదీన మకర సంక్రాన్తి పండుగ. సూర్యుడు జనవరి 14వ తేదీ రాత్రి 2 గంటలా 7 నిమిషాలకు మకర రాశిలో ప్రవేశిస్తున్నందు వలన మరుసటి రోజు జనవరి 15వ తేదీ బుధవారం మకర సంక్రాన్తి. ఈ రోజుననే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. సంక్రాన్తి పురుషుని ప్రస్తావన సూర్యసిద్ధాన్త పంచాంగ గ్రంథాలలో వుంది.

ఈ సంక్రాన్తిలో ఇళ్ళముందు పేడనీళ్లు చల్లి రకరకాల ముగ్గులు వేసి వానిపై పేడముద్దలు పెట్టి వాటిపై పూలు వుంచుతారు. సామాన్యంగా గుమ్మడి పూవును ఉంచుతారు. బాలికలు వీటి చుట్టూ తిరుగుతూ గొబ్బెమ్మ పాటలు పాడుతారు. సంక్రాన్తినాడు నువ్వుల నూనెతో తలంటుకొని నువ్వుల పిండిని శరీరమంతా రుద్దుకొని స్నానం చేయాలి. నువ్వులదానం, వస్త్రదానం, గుమ్మడికాయ దానాలను నేడు చేయాలి. పితృ దేవతలకు తర్పణం వదలాలి.

"అధః పంచదశ,, ఊర్ధ్వంచ పంచదశేతి" అని హేమాద్రి సిద్ధాన్తంలో చెప్పినట్లు సంక్రమణ సమయానికి ముందు పదిహేను ఘడియలు, సంక్రమణ తరువాత పదిహేను ఘడియలు సంక్రమణ పుణ్యకాలము.

సంక్రాన్తి రోజు ఉదయాన్నే అభ్యంగన స్నానం చేసి శుద్ధిచేసిన స్థలంలో మండపం ఏర్పరచి, ఎఱ్ఱగుడ్డను పఱచి, దానిపై అష్టదళపద్మాన్ని వేసి అందు సూర్యనారాయణ విగ్రహాన్నుంచి పంచోపచారాలతో పూజ చేసి ఏకభుక్తవ్రతం చేస్తే సూర్యానుగ్రహంతో అన్ని వ్యాధులు పోతాయి. సర్వపాపాలు నశిస్తాయి.

Scanned by CamScanner

సద్గురువాణి

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ఓ సాధకుడా! నీవు నిరంతర ధ్యాన సమాధులను శీలించుచుండిన మనో నైర్మల్యము మాత్రము గల్గును. ఓ భక్తోత్తముడా ! నీవు సదాభగవత్ సంకీర్తన, స్మరణ, జపాదులు మాత్రము చేయుచుండిన వాక్‌శుద్ధి మాత్రమే సిద్ధించును. నిష్కామకర్మ యోగము సదా చేయుచుండు ఓ యోగిసత్తమా! నీవు దేహేంద్రియాదులచే సదా ఈశ్వర ప్రీతికరమగు కార్యములు చేయుచుండిన ఇంద్రియ శుద్ధియు, కాయశుద్ధియు మాత్రమే గలుగును. కావున విశాలబుద్ధిగల నిర్మలాత్ముడా! త్రికరణ శుద్ధిని కోరువారు పైన జెప్పిన మూడు కార్యములను సదా చేయుచుండవలయును. ఇట్టివారే ఉత్తమ యోగనిష్ఠులనందగును. పైన చెప్పిన వాటిలో ఒక్కొక్కటి మాత్రము చేయువారికి ఒక్కొక్క ఇంద్రియము మాత్రమే శుద్ధినొందును. మూడు విధములగు పైన జెప్పిన తపస్సు చేయువారికి మూడు దేహములు శుద్ధపడి గుణత్రయాతీత జ్ఞానము కలుగును.

ఒక్కొక్కటి చేయువారికి ఒక విధమగు లాభమే గల్గును. మూడు పనులు చేయువారికి మూడు విధములుగా లాభమేర్పడును. మూడింటికి విలక్షణుడై మూడు దేహములను దైవకార్యములను చేయించేలాగున ప్రయత్నించువాడు సిద్ధ పురుషుడును, మహర్షియును యనందగును.

వివిధములగు లోహములచే వివిధాకృతులుగల పాత్రలలో నుండు జలము నందు ప్రతిబింబించెడి సూర్యుడు ఒక్కడేయని తెలిసికొన్నట్లు సర్వప్రాణికోట్ల హృదయములో వెల్గుచుండు ఆత్మను లేక దైవమును తన ఆత్మను ఒక్కటిగా కనుగొనుటయే సనాతన ధర్మమగును.

వస్త్రనిర్మాణం చేయువారికి పడుగు పేకలు రెండును యేలాగున సమములుగా నుండవలయునో ఆలాగున బ్రహ్మనిష్ఠ సాధింప తలంపు గలవారికి యోగసాధనమును, జ్ఞాన నిష్ఠయును సమముగా యుండ వలయును. లేనిచో పరిపూర్ణ స్థితిని బొందజాలడు.

శ్రీరామకృష్ణ ఉవాచ

– శ్రీ రామకృష్ణ పరమహంస

బ్రహ్మము జ్ఞానా జ్ఞానాలకు అతీతమైనది :

భగవన్నామాన్ని కీర్తించడంలో లజ్జ ఎందుకు? 'లజ్జ, ద్వేషం, భయం ఈ మూడూ ఉన్నట్లయితే భగవంతుణ్ణి పొందలేవు అన్న నానుడి వుంది కదా! అది మమ్మాటికి నిజం.

'నేను ఇంతటి పెద్ద మనిషిని! నేను 'హరి హరి' అంటూ నాట్యం చేస్తున్నానన్న సంగతి విని తక్కిన పెద్ద మనుషులు ఏమనుకుంటారో! ఆ డాక్టరు 'హరి హరి' అంటూ నాట్యం చేశాడు. ఇది ఎంతగా సిగ్గుపడాల్సిన విషయం' అని అనుకుంటారేమో!" ఇలాంటి భావనలను వదలిపెట్టు.

జ్ఞానం, అజ్ఞానం – రెండింటికీ అతీతుడవైపో. అప్పుడు మాత్రం భగవంతుణ్ణి తెలుసుకోగలవు. నానా విషయాలను తెలుసుకోవడం అజ్ఞానం అంటారు. పాండిత్యం వుందన్న అహంకారం కూడా అజ్ఞానమే. సర్వభూతాలలోను ఉన్నది ఒకే భగవంతుడే – ఈ నిశ్చయాత్మక బుద్ధినే జ్ఞానం అంటారు.

భగవంతుణ్ణి విశేషంగా తెలుసుకొంటే, దాన్ని విజ్ఞానం అంటారు. కాలికి ముల్లు గుచ్చుకుంటే దాన్ని లాగివేయడానికి మరొక ముల్లు అవసరమౌతుంది. గుచ్చుకున్న ముల్లును బయటికి తీశాక రెండు ముళ్ళనూ పారవేయవచ్చు. అజ్ఞానమనే ముల్లును తొలగించడానికి జ్ఞానమనే ముల్లును తీసుకురావలసి వుంటుంది. అటు పిమ్మట జ్ఞానాజ్ఞానాలను రెండింటినీ పారవేయాలి.

భగవంతుడు జ్ఞాన అజ్ఞానాలకు రెండింటికీ అతీతుడు.

సాధన పంచకము

– శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(2019 నవంబరు తరువాయి)

“వేదో నిత్యమధయతాం తదుదితం కర్మన్వనుష్ఠీయతామ్”

ఈ సాధనమును చెపుకొనుచు ఇందులో నైమిత్తిక కర్మలతో ప్రారంభించి తెలిసికొందము. నిమిత్తాన్ని ఆశ్రయించుకొని చేసే కర్మను నైమిత్తిక కర్మయందురు. “పుత్రజన్మాద్యను బంధీని జాతేష్ట్యా దీని నైమిత్తి కాని”।

పుత్రులు పుట్టినపుడు జాతశౌచాది కర్మలు, మరణించినపుడు మృతశౌచాది కర్మలు, “అష్టవర్షే బ్రాహ్మణం” అన్నట్లు 8 సంవత్సరాలకి ఉపనయనం చేయాలనే మొదలగునవి, అన్న ప్రాశనం, నామకరణం ఈ విధమైన సంస్కార కార్యములు నైమిత్తిక కర్మలనబడును. అట్లే సూర్య చంద్ర గ్రహణముల నిమిత్తములనాశ్రయించి చేయు స్నానజపాదికములు, గురుగ్రహం మేషాది 12 రాశులనాశ్రయించి ఒక రాశి నుండి వేరొక రాశికి మారినపుడు ఒక్కొక్క నదికి పుష్కరము జరుగును. ఈ విధముగా సింహ, కన్యా రాశులలోకి వచ్చిన సమయములలో గోదావరి, కృష్ణ నదులలో పుష్కర స్నానాలు 12 దినములు. ఇవి దక్షిణ ప్రాంతీయులకి తెలిసినదే. ఉత్తరాదిలో కుంభమేళాలు ఇవన్నియు నైమిత్తి కర్మలు. ఇవి శాస్త్రము ద్వారా నిరూపింపబడినవి. కనుక ఆచరించదగినవి.

ప్రాయశ్చిత్త కర్మలు: “పాపక్షయ సాధనాని చాంద్రాయణా దీని నైమిత్తికాని” పాపనాశము కొఱకు అనుష్ఠించు చాంద్రాయణాది వ్రతములను

ప్రాయశ్చిత్త కర్మలని చెప్పబడును. శాస్త్ర విహిత కర్మలననుష్ఠించకపోవుట వలనను నిషిద్ధ కర్మలననుష్ఠించు వలన గలుగు పాపమును చాంద్రాయణాది వ్రతముల ద్వారా నశింపజేసుకొన వలయును. చాంద్రాయణ వ్రతమనగా– చంద్రుని యొక్క వృద్ధి క్షయముల ననుసరించి ఆచరింపబడిన వ్రతమును చాంద్రాయణమందురు. ఈ వత్రమును శ్లుకపక్ష పాడ్యమి నాడు ప్రారంభించ వలయును. ఆనాటి నుండి అన్యకర్మలను (పనులను) వదలి భగవంతుని భక్తితోనారాధించుచూ, చంద్రకళల కనుగుణముగా ఆహారమును గ్రహించు చుండవలెను. ఎట్లన తాను ఒక పర్యాయము చేయు భోజనమును 15 కబళములుగా చేసి (15 వంతులుగా జేసి) పాడ్యమి దినమున ఒక్క కబళమును మాత్రము (ఇంత పరిమాణము గల అన్నమును) తినవలెను. అత్తీతి అన్నము ఏది తినబడుతుందో దానిని అన్నమందురు. గోధుమ పిండితో తయారు చేయబడు రొట్టెలు తినువారు గూడా పైవిధముగా ఒక పూట ఆహారమును 15 విభాగములను చేసి ఒక కబళమును తీసుకొన వలెను. ఏ దినమునకా దినమే ఆహారము తయారు చేసుకొని తినవలెను. మాంసాహారము తినగూడదు. మద్యపానము చేయగూడదు. విదియ నుండి పూర్ణిమ వరకు ఒక్కొక్క కబళము ఆహారమును పెంచవలెను. అనగా ప్రారంభ దినం ఒక కబళము, రెండవ దినం రెండో కబళములు ఈవిధముగా పూర్ణిమ వరకు పెంచవలెను.

పూర్ణిమ వెళ్లిన పాడ్యమి రోజు ఒక్క కబళమును మాత్రము భుజింపవలెను. విదియ నుండి చతుర్దశి వరకు ఒక్కొక్క కబళమును పెంచి అమావాస్య నాడు పూర్తి ఉపవాసమును పాటించవలెను. ఈ విధముగా ఒకనెల దినముల ఆహార నియమముకూడి చేయు ఈ వ్రతమును చాంద్రాయణ వ్రతమందురు. ఆది శబ్దముచే కృచ్ఛ వ్రతము, పంచగవ్య ప్రాశనము ఈ మొదలగునవి గ్రహింపవలెను. శరీర ఆరోగ్యము లేనివారు ప్రస్తుత పరిస్థితులలో కృచ్ఛ్ర చాంద్రాయణ వ్రతములు చేయరాదు.

Scanned by CamScanner

అజ్ఞానముచే నిషిద్ధ కర్మ లాచరణచే గలుగు పాపఫలం పరిహారమునకై పశ్చాత్తాపమును పొంది భగవన్నామమును జపించవలెను. "జపతో నాస్తి పాతకమ్" కనీసం జపం పది వేలుగాని, ఇరవై వేలుగాని చేయవలెను. ఎవరినైనా బాధ గలిగించిన పశ్చాత్తాపమును జెంది క్షమాపణ చెప్పవలెను.

ఉపాసన కర్మలు: "ఉపాసనాని సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపార రూపాణి శాండిల్య విద్యాదీని"

సగుణ బ్రహ్మ విషయమునకు సంబంధించిన మానసిక వ్యాపారము ఉపాసనయని చెప్పబడును. ధ్యేయము యొక్క సన్నిధి నాశ్రయించుటయే ఉపాసనయని చెప్పబడును. ధ్యానించడానికి యోగ్యమైన దానిని ధ్యేయ మందురు. ఎవరికి ఏ దేవత ఇష్టమో ఆ దేవత మంత్రమును ఆ రూపాదులను మనస్సునందు చింతించుటయే ఉపాసన అగును. దీనితో మనస్సు ఏకాగ్రతను పొందును. ఉపాసన ఫలం సిద్ధించును. ఈ జన్మలో దృడా పరోక్ష ఆత్మజ్ఞానమును పొందనిచో ఈ శరీరము విడచిన తరువాత చతుర్ముఖ బ్రహ్మ లోకమును పొంది బ్రహ్మ ప్రళయ కాలంలో బ్రహ్మ ద్వారా ఆత్మజ్ఞానమును పొంది ముక్తిని పొందెదరు.

"తేనేశస్య విధీయతామపచితిః

కామ్యే మతిస్త్యజ్యతామ్"।

ఈ చరణములో 3,4 సాధనములు చెప్పబడుచున్నవి. ముందు చెప్పిన కర్మానుష్ఠానముచే ఈశ్వరుని అనగా భగవంతుని ఆరాధించవలెను. ఈవిధమైన కర్మానుష్ఠానమును ఈశ్వరారాధనగా భావించవలెను. "కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్" అని గీత. వేదము నుండి కర్మ పుట్టినది. అక్షర స్వరూపుని నుండి చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించెను. కర్మఫలం పరమేశ్వరుని కర్పించవలెను. "యత్కరోషి యదశ్నాసి యజ్జుహోసి

దదాసియత్। తత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వమదర్పణమ్"॥ అని గీత. అర్జునా! చేయదగిన ఏ పనిని చేయుచున్నావో "తినదగినది దేనిని తినుచున్నావో, చేయదగిన సాత్వికములైన పూజా హోమాదులు దేనిని చేయుచున్నావో, ఇవ్వదగినవి దేనిని ఏ వస్తువులను దానము చేయుచున్నావో, నియమ బద్ధముగా పూజా, జప, ధ్యానాదులు, నియమిత ఆహారాదులను, మాంసాహారములను విడచిపెట్టి, సాత్వికాహారాదులను సేవించెడి రూప తపస్సులను యేయే తపస్సులను చేయుచున్నావో వాటినన్నింటి ఫలములను దైవార్పణ బుద్ధితో చేయవలెను. 'కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన" అని గీత కర్మఫలమును ఆశించకుండా కర్మ చేయుట యందే నీకధికార మున్నదని అర్జునునికి తెలియజేసెను. చేయదగిన కర్మలను చేస్తూ భగవంతని కర్పించవలెనని భావము. చేసిన కర్మల ఫలమంతా భగవంతునికే సమర్పిస్తే మనకేముంటుందియని కర్మఫలం సమర్పించుటకు కొంతమంది సందేహిస్తుంటారు. ఉదాహరణకు మీరు ఒక నెల జీతం డబ్బు తెచ్చి బీరువాలో పెట్టి కృష్ణార్పణం అన్నారు. ఇలా ప్రతినెల సమర్పించిన ఒక్కపైసా కూడా తీసుకెళ్ళరు. మనకు కర్తృత్వ భావముండదు. అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. ఆత్మానాత్మ విచారణకు తగు యోగ్యమైన బుద్ధి కలుగుతుంది. అనాత్మ భావనలను, శాస్త్ర నిషిద్ధ కర్మలను దూరం చేస్తుంది. ఇందుచే "కర్మాణి చిత్తశుద్ధిర్థ్యం" అని ఆచార్యులవారు చెప్పిరి.

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

1. శబరిమాతాశ్రమము (భూత్)	-	రూ. 2000/-
2. శంకం హరీష్ (మియాపూర్, హైద్రాబాద్)	-	రూ. 2500/-
3. కె. సత్య మహేష్ (హైద్రాబాద్)	-	రూ. 2000/-
4. ఎం.జె. శర్మ (పిఠాపురం)	-	రూ. 2000/-
5. కె. గురుప్రసాద రావు (హైద్రాబాద్)	-	రూ. 2000/-

సంఘ సంస్కరణ దీక్షాదక్షులు

కందుకూరి- శ్రీ మలయాళస్వాములవారు

- డా॥ నముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

స్త్రీలలో విద్యావ్యాప్తికై పాటుపడడమే కాక వితంతు స్త్రీల పునర్వివాహం కొరకై శ్రీకందుకూరి వారు కావించిన తీవ్రమైన కృషి వారిని సాటిలేని సంఘ సంస్కర్తగా నిరూపించింది. విప్లవాత్మకమైన ఈ ఉద్యమంలో సనాతనులనుండి ఎంతో వ్యతిరేకతను వారు ఎదుర్కోవలసి వచ్చింది.

ఇక ఒక తపస్విగా, తత్త్వవేత్తగా, సన్న్యాసిగా, సద్గురువుగా పేరొందిన శ్రీమలయాళ సద్గురుదేవులు స్త్రీల పునర్వివాహ విషయమై ఏమి చెప్పారో గమనింపదగి యున్నది.

శ్రీ స్వాములవారు వ్యాసాశ్రమం తరపున 'యథార్థభారతి' అన్న ఒక ఆధ్యాత్మిక మాసపత్రికను ప్రారంభించారు. దానిలో 1933 నుండి 1937 వరకు ప్రకటించిన వ్యాసాలను "ధర్మ సేతువు' అన్న పేరుతో ఒక పుస్తకంగా 1937లో ప్రకటించారు. అందులో 'పునర్వివాహము' అన్న శీర్షికతో ఒక సుదీర్ఘ వ్యాసం (58 పుటలు) వ్రాసి ముద్రింప జేశారు. ఆ గ్రంథం తదుపరి పలు ముద్రణలు పొందింది. 2001లో ప్రచురింపబడిన 'శ్రీమలయాళ సద్గురు గ్రంథావళి'లోని నాల్గవ సంపుటంలో ఈ వ్యాసాన్ని చూడవచ్చు. అందలి కొన్ని ముఖ్యాంశాలను ఇక్కడ ప్రస్తావించుకొందాం.

"పురుషులకు పునర్వివాహము శాస్త్ర మంగీకరించి యుండినచో స్త్రీలకున్ను అట్టి అంగీకార మవశ్యముండే తీరవలయును. అట్లు గాని శాస్త్రము పక్షపాతులచే నిర్మితమేగాని నిష్పక్షపాతియగు సర్వేశ్వరునిచే నిర్మితము గాదు. ఇట్టి పక్షపాతమునకేలాంటి ఆధారము గనిపింపదు. ఒక తప్పు ఇద్దరు చేసినచో ఒకరిని శిక్షించుట మరి యొకరిని మన్నించుట న్యాయము గాదు. ఇట్లు చేయుటకేలాటి కారణమును తత్త్వజ్ఞులకు గనపడదు.. ఇది ఒకరిని అల్లునిగాను, మరియొకరిని అన్యునిగాను చేర్చిన రీతిగా నుండునే గాని మఱియేమియు దీనియందు సత్యము గానరాదు." (శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి సంపుటం 4-154 పుట).

కళావంతులు గూడ ధర్మోక్త విధిననుసరించి వివాహము చేసుకోవడమే సముచితమని చెబుతూ ఈ వ్యాసములోనే శ్రీ స్వామివారిలా వ్రాశారు.

"కళావంతులు గూడ ధర్మోక్తముగా వివాహము చేసుకొనుట వారికి ఎంతో శ్రేయోదాయకము, యశస్కరము. వారిలో గల గౌరవ పురుషులెందరో యీ నీచకార్యముచే తన కులమేది యని యెవరైన అడిగినచో చెప్పుటకు సిగ్గు పడుచున్నారు. అలాగున చాలామంది స్త్రీలను ఈ నీచకృత్యముచే జన సముదాయములో సంచరించుటకు లజ్జనొందుచున్నారు. కావున ఇదంతయు దైవశాసనము గాదు. దయ్యపు గుణము గలవారు సృష్టించిన పైశాచిక కృత్యమని అందరున్ను తెలుసుకొందురుగాక! (అందే - పుట - 170)

కన్యాశుల్కం, వరకట్నం అనే దురాచారాలను గూడా స్వాములవారు ఖండించారు. వాటిని పాపకృత్యములని నిరసించినారు. ప్రజాపరిపాలిత రాజ్యాంగ విధానం ద్వారా ఆ దురాచారాలను నిషేధించవలెనని వివరించారు. (చూడు -అందే -172 పుట).

వితంతువులు ఇంద్రియ నిగ్రహం కల్గి సత్య ధర్మాలు, దైవభక్తి, జ్ఞాననిష్ఠ గలవారై యుండుట పునర్వివాహముకంటె శ్రేష్ఠతరమైన మార్గము. అట్లుండ జాలక గర్భ విచ్ఛేదాది పాపకృత్యములు చేయువారు పునర్వివాహము చేసుకోవడమే మంచిదని స్వామి అభిప్రాయము. అట్టి వివాహములో ఎట్టి పాపమూ లేదనీ, అది ఈశ్వర ద్రోహం కాదనీ, శాస్త్ర విరుద్ధముగూడ కాదనీ నిర్ణయాత్మకంగా స్వాములవారు చెప్పియున్నారు. (పుట- 175)

గ్రంథరచన

శ్రీ కందుకూరివారు సువిశాలమైన సాహిత్యాన్ని సృష్టించి ఆంధ్రసారస్వతాన్ని సంపన్నం కావించారు. ప్రతి రచనలోనూ సమాజ సంస్కరణాత్మకమైన ప్రబోధాలు కావించారు.

శ్రీ మలయాళస్వామివారు గూడ విస్తృతమైన ఆధ్యాత్మిక సారస్వతమును రూపొందించారు. వారు రచించిన మొత్తం గ్రంథాల సంఖ్య 57. ఈ గ్రంథాలనన్నింటినీ 20 సంపుటాలుగా కూర్చి పరిష్కరించి వ్యాసాశ్రమం ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ముద్రించి 2001లో జరిగిన ఆశ్రమ వజ్రోత్సవాలలో ఆవిష్కరించడం జరిగింది. ఆ గ్రంథాల ప్రచురణకు సంపాదకత్వం వహించే అదృష్టం ఈ వ్యాస రచయితకే లభించిందని సవినయంగా మనవి చేసుకొంటున్నాను.

వర్ణ వ్యవస్థ

"ఇతరుల ఆత్మోన్నతికి అడ్డుపోకుడు. మీ ఆత్మోన్నతికి అడ్డు కల్గిన తొలగించుకొనుడు. సాధ్యమైనచో ఇతరులకు సాయపడుడు. ఇదే సనాతన ధర్మం" అని శ్రీ మలయాళ సద్గురు దేవులు తమ వేదాంత సభలలో ఎలుగెత్తి చాటారు.

హిందూ సమాజంలోని 80శాతం ప్రజలు జన్మతః తక్కువ స్థాయికి చెందినవారన్న మూఢ విశ్వాసం కారణంగా వారి ఆత్మోన్నతిని అడ్డుకోవడం జరిగింది. వర్ణ వ్యవస్థకు గుణకర్మలు గాక కాలక్రమంలో పుట్టిన కులమే మూలమయింది. ఈ స్థితిని సంఘ సంస్కర్తలందరూ నిరసించినవారే. ఆర్యసమాజం వంటి సంస్కరణ పథంలో సాగిన సంస్థలు శతాబ్దాల తరబడి కొనసాగుతూ వచ్చిన మూఢ విశ్వాసాలను రూపుమాపి వేదోపనిషద్విద్యలను అందరికీ అందుబాటులోకి తెచ్చాయి.

శ్రీ మలయాళ సద్గురు దేవులు తమ ప్రతి ప్రబోధంలోనూ, ప్రతి రచనలోనూ సమన్యాయం పాటించని హైందవ సమాజాన్ని సంస్కరించ వలసిన ఆవశ్యకత గురించి నొక్కి వక్కాణించారు.

వారు తిరుమల గోగర్భంలో ఉన్నప్పుడు వర్ణవ్యవస్థా విషయమై వేదాధ్యయనార్హతపై బ్రాహ్మణ బ్రాహ్మణేతరుల మధ్య సుదీర్ఘమైన సంవాదాలు జరిగాయి. ఈ సంవాదాలను తరువాత శ్రీ స్వాములవారు 1945లో గ్రంథరూపంలో ప్రకటించారు. 350 పుటలకు విస్తరించిన ఈ గ్రంథానికి 'లోకోద్ధారకము అని నామకరణం చేశారు. ప్రశ్నోత్తర రూపంలో ఇందు జాతిని గూర్చిన చర్చ చేయబడింది. వర్ణవ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలను ఇందులో కూలంకషంగా చర్చించడ మయింది. పుట్టుకతో ముడిపడిన వర్ణ నిర్ణయాన్ని ఈ గ్రంథంలో శ్రీస్వాములవారు నిశితంగా ఖండించారు. సమాజాభ్యుదయవాదులందరూ తప్పక చదువదగిన గ్రంథమిది. కులభేదం లేకుండా జిజ్ఞాసువులందరూ వేదాధ్యయనానికి అర్హులే అని ఇందులో నిరూపించడం జరిగింది.

కువ్యాఖ్యా ఖండనం

పూర్వం భగవద్గీతాది గ్రంథాలకు అనేకులు వ్యాఖ్యలు రచించారు. ఆ వ్యాఖ్యలలో ఎక్కడైనా సమాజాభ్యున్నతికి నిరోధకమైన వ్రాతలు సంభవిస్తే వాటిని శ్రీ స్వాములవారు తీవ్రంగా ఖండించారు.

ఉదాహరణకు భగవద్గీతలోని తొమ్మిదవ అధ్యాయం 32వ శ్లోకానికి –వాఖ్య వ్రాసిన కొందరు పూర్వులు స్త్రీలు, శూద్రులు, వెశ్యులు పాపయోని సంభూతులని వ్రాశారు. 'పాపయోనయః' అన్న మాటను వారి కన్వయించకుండా ప్రకారాంతరంగా వ్యాఖ్యానించడానికి అక్కడ అవకాశామున్నది. కాని వారు దానిని పాటించలేదు.

Scanned by CamScanner

ఈ సందర్భంలో వారి వ్యాఖ్యా విధానాన్ని నిరసిస్తూ తాము రచించిన గీతావ్యాఖ్యలో స్వాములవారిలా వ్రాశారు.

"కొందరు ఈ శ్లోకమునకు స్త్రీలు, శూద్రులు, వైశ్యులు మొదలైనవారు పాపయోని సంభూతులని వ్యాఖ్యానము చేసి యున్నారు. ఇది యెంత పాతకము! తన తల్లిని పాపాత్మురాలని తలంచువాడు గూడ పాపియే యగును. తన తల్లిని పుణ్యాత్మురాలని తలంచువాడు. పుణ్యాత్ముడగును" (శ్రీ మలయాళ సద్గురు గ్రంథావళి సంపు 6-318 పుట) ఇంకా దీనికి సంబంధించిన విశేష వివరణను స్వామీజీ రచించిన గీతా వ్యాఖ్యానములో చూడండి!

శ్రీ సాయం వరదదాసు అనే కవి శ్రీ స్వాములవారి ముఖ్య శిష్యులలో ఒకడు. శ్రీ గురుదేవుల శుష్క వేదాంత తమోభాస్కర గ్రంథాన్ని ప్రశంసిస్తూ ఆయన వ్రాసిన ఈ క్రింది పద్యం స్వాములవారి సంఘ సంస్కరణోద్యమాన్ని కీర్తిస్తున్నది.

హీన శూద్రుల కేల జ్ఞాన విద్యల టంచు
అగ్ర జాతులు గర్వమందు వేళ
అబలలకేల బ్రహ్మజ్ఞాన మంచును
పురుషులు లోభులై పోరువేళ
దిక్కింత లేనట్టి దీన జీవుల బట్టి
కర కర కంఠముల్ దరుగువేళ
బ్రహ్మవిద్య యగాధ పతితమై పోవంగ
జేయు దుష్టాత్ములు చెలగువేళ
రహి-వెలుంగ తమోభాస్కరంబనంగ
మించు విజ్ఞాన ఢక్క మ్రోగించినావు.
కలుషదూర! వ్యాసాశ్రమ స్థలవిహార !
పరమ కారుణ్య ! మలయాళ గురువరేణ్య?

(శ్రీ మలయాళ సద్గురు స్మరణామృతం)

లోకం శ్రీ స్వామివారిని సద్గురువుగా, తత్త్వవేత్తగా గుర్తించినంతగా సంఘ సంస్కర్తగా గుర్తించలేదు. కాని శ్రీ కొండవీటి వెంకట కవి పేర్కొన్నట్లు స్వామివారి ఆధ్యాత్మకోద్యమం క్రింద చాపక్రింద నీరు లాగా సంఘ సంస్కరణ గూడా వ్యాపించి యున్నదనడం నిర్వివాదం.

నిద్రించుటకు ఇది సమయం కాదు

– శ్రీ స్వామి వివేకానంద

సోదరులారా! మనమందరమును గొప్ప దీక్షతో పని చేయుదము! నిద్రించుటకిది సమయము కాదు. భావి భారతదేశపు అభ్యుదయము మన కార్యదీక్షపై ఆధారపడియున్నది. భారతమాత కాచుకొని సిద్ధముగనున్నది. లెండు! నిదుర మేలుకొనుడు. మన భారతమాతను చూడుడు! ఇదివఱకెన్నడును లేని మహావైభవముతో ఉత్తేజముతో ఆమె తన శాశ్వత సింహాసనముపై నెట్లు కూర్చొనియున్నదో చూడుడు!

సంక్రాన్తి శుభాకాంక్షలు

వినుతి గాంచినట్టి వేదాన్తభేరిని
చదువుచున్న భక్తజనులకెల్ల
కాళహస్తి శివుడు కరుణతో సంక్రాన్తి
శుభములొనగుగాక ! సురుచిరముగ॥

Scanned by CamScanner

మూలం: **ఉద్ధవ గీత** అనువాదం:

శ్రీ వ్యాసమహర్షి యేలేశ్వరపు హనుమరామకృష్ణ

భక్తి యోగము - ధ్యాన విధానము

శ్రీ ఉద్ధవుడు : హే శ్రీకృష్ణా! భగవానుడగు బ్రహ్మదేవుడు వివిధ ఋషులు - మానవుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సాంఖ్యమార్గం, యోగ మార్గం, ధ్యాన మార్గం, త్యాగ మార్గం- ఈ విధములైన వివిధ సాధన మార్గాలు బోధిస్తున్నారు కదా! ఆయా మార్గాలలో అన్నింటికన్నా శ్రేష్ఠమైన మార్గం ఏదో.. అది చెప్పండి! మా అందరికి సులభము - ఉత్తమమైనది- శ్రేయస్సు కలుగజేయగల అతిముఖ్యమైనదేదో చెప్పండి!

మీరు భక్తి యోగం బోధిస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. మీ పట్ల నిష్కామమైన భక్తి **యోగం సర్వగురువుల సమ్మతమా!**, లేక యోగ-ధ్యాన- కర్మ-యాగాదులు ప్రతిపాదిస్తున్న వేరు వేరు గురువులయొక్క వారు బోధిస్తున్న ఆయా మార్గాలే అధికంగా సమ్మతమా!

జీవుడుగా నాకు ఏ మార్గం సులభము? సర్వజనామోదం? నన్ను త్వరితగతిన ఉద్ధరించగల మార్గమేదో... అదీ చెప్పండి!

శ్రీకృష్ణ భగవానుడు : ఓ ఉద్ధవా! పూర్వాపర వివరణలతో ఇక్కడ నీ ప్రశ్నకు సమాధానంగా కొన్ని విశేషాలు చెప్పుతాను! విను!

ఈ కనబడేదంతా నా ఆత్మ యొక్క విన్యాసమే! ఆత్మ సర్వదా అఖండమైవుండి, ఈ తదితరంగా అనిపిస్తోంది!.. అను జ్ఞానమే ఆత్మజ్ఞానం! వేదములు అట్టి ఆత్మ ధర్మమును ఎలుగెత్తి గానం చేస్తున్నాయి. అట్టి ఆత్మ ధర్మము (The Characterisitc feature of self) ను మొట్టమొదట నేను సృష్టికర్త యగు బ్రహ్మ దేవునికి బోధించటం జరిగింది. అట్టి ఆత్మధర్మము అను

పరమసత్యము సృష్టికి ముందు - సృష్టికి తరువాత - సృష్టి సందర్భంలో కూడా సర్వదా అనునిత్య సత్యమై యున్నది.

అట్టి ఆత్మ ధర్మము యొక్క అవగాహన ప్రళయకాలంలో ఏమరచబడటంచేత సృష్ట్యాదిలో బ్రహ్మ దేవునికి వేదవాణి రూపంగా బోధించాను. బ్రహ్మదేవుడు తన కుమారుడు - స్వయంభువు అగు మనువుకు బోధించారు. **భృగువు, అంగీరసుడు, మరీచి, పులహుడు, అత్రి, పులస్త్యుడు, క్రతువు**...అను సప్త బ్రహ్మ మహర్షులకు బోధించటం జరిగింది! భృగువు మొదలైన ఆ సప్త బ్రహ్మమహర్షులు - తమ తమ సంతానమగు దేవతలు, దానవులు, గుహ్యకులు, మనుష్యులు, సిద్ధ- గంధర్వ -విద్యాధర - చారణులు, కింపురుషులు, కిన్నెరులు- నాగులు - రాక్షసులు మొ॥ వారికి బోధించగా వారిలో అనేకులు అది గ్రహించారు. అయితే ఆయా జీవులంతా భిన్న భిన్నములైన సత్వ - రజో- తమోగుణ సంపన్నులై ఉండటంచేత భిన్న భిన్నములైన దృష్టి - అవగాహనలు కలిగి ఉండసాగారు! వాసనలను (tendencies) అనుసరించే దేవతలు-అసురులు- మనుష్యులు -భూతములు -భూతపతులు భిన్న-భిన్నంగా ఉంటారు కదా! ఆయా జీవులంతా వారి వారి చిత్ర - విచిత్రమైన వాసనలను అనుసరించి ఆత్మ తత్త్వజ్ఞానము (త్వమ్ స్వరూపతః మమాత్మ యేవ - అను పార్యాంశాము) విషయమై అన్వయించుకోసాగారు. ఆవిధంగా చిత్ర విచిత్రముల్లైన వర్ణనలు వేదవ్యాఖ్యానరూపంగా వెలువడసాగాయి. వెలువడుచున్నాయి. అనేక శబ్దాలు వాటికి వేరు వేరైన అర్థ ప్రయోగాలు బయల్వెడలుచున్నాయి. అంతేకాదు! ఈ మానవుల స్వభావాన్ని అనుసరించి బుద్ధిభేదం ఏర్పడుతోంది. ఇంకా కొందరు వేదముల అధ్యయనం చేయనివారై ఒకానొక గురువు యొక్క కొన్ని వాక్యములను (లేక) అభిప్రాయములను మాత్రమే ప్రమాణంగా తీసుకొని పారంపర్యంగా ఆ వాక్యాలకు మరికొన్ని అర్థాలను కల్పించుకొని "ఇంతే! ఇంతవరకే! మరింకెవరు ఏది చెప్పినా ఆలోచించవద్దు! విచక్షించవద్దు!

అసలు ఇంకేమీ వినవద్దు!" - అనే పరిమితమైన అవగాహనకు కట్టుబడినవారై వుంటున్నారు. ఇందులో కొందరు పాషండ మతస్థులై "పరమాత్మ లేదు! దేహమే వున్నది! మరణానంతరం ఈ జీవుడు నశిస్తాడు! ఇక ఆపై మరేమీ లేదు! ఉన్నంతవరకు తినండి! త్రాగండి! అంతే! ఇంతకుమించి ఏదీ విచారణ చేయకండి! ఇదే వేదసారం!" అని కొన్ని దేహసంబంధమైన సంకుచిత భావాలకు - అభిప్రాయాలకు కట్టుబడినవారై వుంటున్నారు.

ఇక మరికొందరు, "మనమంతా ఒక జాతివారం! ఇతర జాతివారిని హింసించటం, బాధించటమే మన గురువు యొక్క సేవ!"- అని కూడా భావన చేస్తున్నారు. హింసాత్మకమైన ప్రవర్తనకు సిద్ధమగువారు! అందుకు చావుకైనా సిద్ధపడేవారు కూడా ఉంటున్నారు!. ఓ ఉద్ధవా! పురుష శ్రేష్ఠా! నా మాయచే మోహితులైన మరికొందరు వారివారికి రుచించే క్రియలు- కర్మలను అనుసరించి నానా విధములైన సాధనలను, సాధనాక్రమమును నమ్మి... అదే తదితరులకు బోధించేవారు కూడా వున్నారు!. ఉండబోవుచున్నారు కూడా! "ధనమే అన్నింటికీ మూలం! దైవభక్తి వలన ధనం లభిస్తుంది"- అనే భావం ఆశ్రయించి దైవభక్తిని సాధనముగాను, ధన -సంపదలను సాధ్యముగాను భావించటం కూడా కొందరి విషయంలో జరుగుతోంది. మరికొందరు ధర్మమే శ్రేయోసాధనం. పరోపకారులమై వుంటే చాలు. ఆత్మవిచారణతో పనిలేదు- అను భావన కలిగి ఉంటున్నారు.

యశస్సు - కామము-దమము-శమము- ఐశ్వర్యము- భోగములు -యజ్ఞము-తపస్సు- వ్రతనియమము... ఇత్యాదులు ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిగా శ్రేయోసాధనములుగా కలిగి వుంటున్నారు? ఈ విధమైన భావనలచే ఆశ్రయిస్తున్న అనేక కర్మపరంపరలను ఆశ్రయించటంచేత...కాలక్రమేణా వాటిలో కొన్నిటి యొక్క అంతిమ ప్రయోజనములన్నీ దుఃఖ పరిణామములు

గాను, మోహజనకములుగాను, అల్పఫలప్రదాతలు గాను, శోకయుక్తములు గాను అయి వుండటం కూడా జరుగనారంభించాయి.

ఓ ఉద్ధవా! ఎవ్వరైతే తమ మనస్సును సర్వాత్మకుడనగు నాయందు నిలుపుతూ క్రమక్రమంగా మనస్సును విషయశూన్యం చేసుకుంటూ వుంటారో... అట్టివారు నా పరతత్త్వమును తెలుసుకుంటారు. పరతత్త్వాన్ని ఎఱిగి ఆస్వాదించుచున్న వారి ఆత్మ సుఖమును- స్వప్నతుల్యమగు ఇంద్రియ సుఖంతో ఏ మాత్రం పోల్చ వీలుండదు సుమా! మనో - బుద్ధులలో కించత్వము లేనివారు (వారు తక్కువవారు - ఇది గొప్పది ఇత్యాది అభిప్రాయములను ఆశ్రయించనివారు), శమ-దమాది గుణాలంకారులు, శాంత మనస్కులు, తమలోని పరస్వరూపుడనగు నన్ను చూసి ఆనందించువారు - ఇట్టివారు మాత్రమే ఈ సర్వజగత్తును సుఖమయంగా దర్శించగలుగుచున్నారయ్యా!

ఇంద్రియ విషయాభిలాషికి ఈ జగత్తంతా దుఃఖమయంగానే అనుభవమౌతూ వుంటుంది!.

సర్వాంతర్యామిని, సర్వతత్త్వ స్వరూపుడను- ద్రష్టయొక్క స్వస్వరూపుడను అగు నాపై మనస్సు నిలిపినవాడు ఇక ఆపై బ్రహ్మ-ఇంద్ర -మహేంద్ర-సార్వభౌమాది పదవులను గాని, పాతాళలోకాధిపత్యమును గాని, అణిమ -గరిమ మొదలైన సిద్ధులను గాని కోరుకోడు!.

స చ మే భక్తి మాం ప్రియః !

ఓ ఉద్ధవా! నా భక్తుడు నాకు ఇష్టమైనంతగా- నా పుత్రుడగు బ్రహ్మదేవుడు గాని, హృదయేశ్వరియగు లక్ష్మీదేవిగాని, స్వరూపభూతుడగు శంకరుడుగాని, నా సోదరుడగు బలరాముడుగాని, నా ఆత్మగాని ఇష్టం కాదు సుమా! నేను భక్త సులభుడను! ఇష్టంగా భక్తులను సర్వదా ఆశ్రయించి

Scanned by CamScanner

ఉంటాను. అంతేకాదు! భక్తుల పాదధూళితో బ్రహ్మాండములన్నీ పవిత్రం చేయటానికై నేను వారి వెంటనంటియే ఉంటాను. నిస్పృహుడు (One who does cross the relatedness of wordly matters), సదా పరతత్త్వజ్ఞాన మననశీలుడు, పరానందస్వరూపముచే పరమానందుడు, శాంతుడు, వైరభావరహితుడు, సమదర్శియు అగు నా భక్తుని నేను సర్వదా అనుసరించియే ఉంటాను! ఆతడు అల్పభావములను త్యజించినవాడై (నిష్కించనుడై) నాకు సమర్పించిన అనురక్త బుద్ధికలవాడై, శాంతుడై, మహాశయుడై వుంటాడు! సర్వజీవరాసులను వాత్సల్య దృష్టితో చూస్తూ ఉంటాడు.

అట్టివారు బాహ్య దృశ్యములపట్ల సర్వ అపేక్షలకు అతీతమైన అనిర్వచనీయమైన ఆత్మసుఖం ఆస్వాదిస్తూ వుంటారు.

ఆపేక్ష (Inquisitiveness towards what is being outwardly seen) కొనసాగించేవారు ఆత్మ సుఖమును పొందలేకపోతున్నారని గుర్తు చేస్తున్నాను! ఉపేక్షచే ఆత్మసుఖానుభవులగుచున్నారు.

భక్తి - ప్రపత్తి

ఉద్ధవుడు : స్వామీ ! మీపై భక్తి ప్రపత్తులు ఉండికూడా... పూర్వాభ్యాసవశంచేత ఇంద్రియములను ఇంకను జయించని నా వంటి ప్రాకృత భక్తుల స్థితి - గతుల మాట ఏమిటి?

శ్రీకృష్ణుడు : నా యందు భక్తి ప్రపత్తులు ప్రవృద్ధమౌతూ ఉంటే ...క్రమంగా సామాన్య విషయాలకు - ప్రలోభాలకు లొంగని బుద్ధి దానంతట అదే బలం పుంజుకుంటూ ఉంటుంది. దృశ్యాకర్షణ క్రమంగా తొలగనారంభిస్తుంది!. అంతేకాదు...!

భక్తియోగమే కాకుండా, అనేకమైన అధ్యాత్మ మార్గాలు ఉన్నాయి,

సాంఖ్య (విచారణా మార్గం)- స్వధర్వ నిర్వహణ, సమర్పణ-స్వాధ్యాయం (వేదమంత్రాల పఠనం) - తపస్సు మొదలైనవి! అయితే అవన్నీ భక్తియోగానికి సాటిరావని, పరమాత్మనగు నన్ను వశం చేసుకోవటానికి భక్తితో సమానంగా సులభం కాదని రెండు చేతులు ఎత్తి ప్రకటిస్తున్నాను!. అవన్నీ భక్తిలో అంతర్విభాగాలవటమే నాకు ఇష్టం. భక్తిశ్రద్ధచే ప్రవృద్ధమౌతుంది. భక్తి క్రమంగా అనునిత్య సాధనాక్రమంగా అనన్య భక్తిగా రూపుదిద్దుకుంటుంది. అప్పుడు ఈ జగత్తంతా కూడా కృష్ణ చైతన్యానందంగా అనుభవమౌతుంది! సాధువులు పరమాత్మను-సర్వప్రియ స్వస్వరూపుడను అగు నన్ను భక్తితో లాభింపజేసుకుంటున్నారు! ఏకాగ్రతచే, సర్వ జీవులుగా ఉన్నది పరమాత్మయే....అనే భావనను ఆశ్రయిస్తూ ఉంటే భక్తి రూపుదిద్దుకుంటోంది. అట్టి అనన్య భక్తిచే చండాలురు కూడా పరమ పవిత్రులౌతారు!.

పరమాత్మ స్వరూపుడనగు నాయందు భక్తి ప్రపత్తి లేని వానిలో గల దయ-ధర్మము-సత్యము- తపస్సు - జ్ఞానము ఇవన్నీ కూడా పరాకాష్ఠయగు పవిత్రతను సంతరించుకోలేవు సుమా!

శరీరము పులకితం కానంతవరకు, చిత్తము ద్రవించనంతవరకు, ఆనందాశ్రువులు కళ్ళ నుండి ప్రవహించనంతవరకు భక్త్యావిర్భావము యొక్క ఔన్నత్యము గాని, భక్తి వలన కలిగే చిత్తశుద్ధిగాని, భక్తియొక్క ప్రభావమైన అనిర్వచనీయ ఆత్మానందము యొక్క అనుభూతి గాని పూర్తిగా అర్థం కావు!.

భక్తిచే కంఠం గద్గదమౌతుంది! చిత్తము వెన్నవలె ద్రవీభూతమౌతుంది! అట్టివాడు ఒక్కొక్కసారి ఆనందంగా నవ్వుతాడు! సిగ్గువిడిచి పెద్దగా గానం చేస్తూ వుంటాడు! తన్మయత్వంతో నృత్యం చేస్తూ వుంటాడు!.

అట్టి భక్తుడు తనయొక్క పరాప్రేమచే మూడు లోకాలను పరమపావనం చేస్తూ వుంటాడు! అగ్నిచే సంతప్తమై బంగారు ఖనిజం తనలోని మలినములు తొలగిపోగా ధగద్ధగాయమానంగా ప్రకాశిస్తుంది

Scanned by CamScanner

చూచావా! ఆ విధంగా, స్వభావంగా దృశ్య సంబంధం గల చిత్తముకూడా భక్తియోగం చేత తప్తమై తనయందలి దోషములను తొలగించుకొని ప్రకాశిస్తుంది! చిత్స్వరూపుడనగు నన్ను స్వభావసిద్ధంగా సేవిస్తుంది! ఆస్వాదిస్తుంది! తన్మయమౌతుంది. అంతా తానే అయి, అంతటికీ వేరై... అనిర్వచనీయ చిదానందముగా అగుచున్నది.

ధూళిచే ఆవరించబడిన కనులు గలవారికి అంజన ఔషధం చేత (కాటుక మందుచేత) కంటిదోషం తొలగించితే వస్తువులు చూడగలుగుతారు చూచావా? అట్లాగే, నాయొక్క అవతార లీలలు, మహిమలు కీర్తించటంచేత చిత్తములోని దోషములు తొలగిపోతాయి. విషయములను సదా ఆలోచించే చిత్తము ఆ విషయములందే చిక్కుకుంటోంది! అదే చిత్తము సర్వతత్త్వస్వరూపుడనగు- సత్యరూపమగు నా గురించి ఆలోచన చేస్తూవుంటే, నాయందు లీనమౌతుంది!.

స్వప్నంలో కనిపించిన ఇల్లు మెలకువ వచ్చేటప్పటికి కనబడదేం?.. అని ఎవ్వరైనా దుఃఖిస్తున్నారా? లేదు కదా! ఇక్కడి ఆశ-నిరాశ- దురాశల రూపమైన మనోరథాలు స్వప్నసదృశాలే సుమా! "ఇక్కడ నాకు ఇంకా ఏదో -ఏదేదో లభించలేదు..." అనే వేదనలను మొదలంట్లా వదలి... పరమాత్మనగు నన్నే ఏకాగ్రతతో అనుస్మరించటం ఉచితమని గుర్తుచేస్తున్నాను! వివేకవంతుడైనవాడవు కనుక, నీవు భౌతిక దేహ సంబంధమైన సాంగత్యములకు అతీతత్వమును సముపార్జించుకుంటూ, సంగమును త్యజిస్తూ ఏకాంతంగా, సావధానంగా ధ్యానం అభ్యసిస్తూ చిత్తమును నా వైపుగా నడిపెదవుగాక! ఓ ఉద్ధవా! దృశ్య సంగముచేతనే ఈ జీవునికి క్లేశములన్నీ వచ్చి పడుచున్నాయయ్యా! బంధమునకు కారణం దృశ్య ధ్యానం చేత ఏర్పడే సంగమేగాని,(Attachment - సంగాత్ సంజాయతే కామః), మరొకరెవరూ జీవునికి బంధం కల్పించటం లేదు.

ధ్యానము

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

ఆధ్యాత్మిక జీవితానికే గాక లౌకిక జీవితానికీ ధ్యానం అత్యావశ్యకం. దైనందిన జీవితంలో అధిక భాగాన్ని ఆక్రమించిన ఉద్రిక్తత నుంచి బైటపడలేక, ఆందోళనకు లోనై, మనశ్శాన్తికి దూరమై, సుఖసంతోషాలు కరువై మానవులు సతమతమవుతున్నారు. దీనిక్కారణం మనస్సు అదుపు తప్పడమే.

మనస్సును అదుపులోనికి తీసుకోడానికి మంచి సాధనం ధ్యానం. అందుకే నేడు ధ్యానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతూంది. ఇంతటి విశిష్టతగల ధ్యానాన్ని గురించి శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు (శ్రీకాళహస్తి) శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు 2004వ సంవత్సరం సెప్టెంబరు నెలలో శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరిగిన సాధనా శిబిరంలో చేసిన ప్రసంగాన్ని సాధకుల సౌకర్యార్థం సంక్షిప్తంగా ఈ వ్యాసంలో తెలుపడం జరుగుతూంది.

'ధ్యై చింతాయాం' అని - ఏ వస్తువునైనా, ఏ విషయాన్నైనా తదేకంగా చింతించడమే ధ్యానము. 'తత్ర ప్రత్యయ ఏకతానతా ధ్యానం' అని పతంజలి చెప్పినట్లు ఎడతెరపి లేకుండా ఒకే వస్తువును గురించో, ఒకే విషయాన్ని గురించో ఆలోచించడం ధ్యానం, ఒకే విషయంపై ఆలోచనా ప్రవాహం ధ్యానం అని అభిప్రాయం. "ధ్యానం నిర్విషయం మనః" ప్రాపంచిక విషయాల చింతన లేకుండా కేవలం పరమాత్మను గురించిన ఎడతెరపి లేని చింతన ధ్యానము. ఇది మనోవృత్తులను నిరోధిస్తుంది. అందువలన మనోవికాసానికి మహోన్నత మార్గం ధ్యానము.

Scanned by CamScanner

మన్త్ర జపం మలదోషాన్ని పోగొడితే, ధ్యానం విక్షేపదోషాన్ని పోగొడుతుంది. మంత్రార్థాన్ని భావిస్తూ, నోటితో మంత్రాన్ని ఉచ్చరిస్తూ, చేతితో జపమాల తిప్పుతూ మనస్సును తేజోమూర్తి అయిన ఇష్టదైవం మీద నిలపడం జపం కాగా, మనస్సును ఇష్టదైవం మీదనో, నాసికాగ్రమందో, హృదయపద్మంపైననో, భ్రూమధ్యలోనో, శ్వాసమీదనో నిలిపి, అన్యచింతలను అరికట్టడం ధ్యానము. జపంలో మనస్సు, నోరు చేయి మూడు అంగాలు పనిచేస్తే, ధ్యానంలో మనస్సు మాత్రమే పనిచేస్తుంది. నోరు, చేతులు, ఇన్ద్రియాలన్నీ నిష్క్రియంగా ఉంటవి.

ధ్యాన సమయం: రోజుకు నాల్గుసార్లు (ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం, అర్ధరాత్రి) ధ్యానం చేయాలి. కనీసం రెండుసార్లు ఉదయం, సాయంకాలం సంధ్యా సమయంలో అయినా తప్పక ధ్యానం చేయాలి. ప్రతి ధ్యాన సమయంలో కనీసం అరగంటకు తక్కువ లేకుండా ధ్యానం చేయాలి. మొదట స్వల్పకాలం ధ్యానంలో గడిపినప్పటికి క్రమంగా రోజుకు ఒక్కొక్క నిమిషం చొప్పున క్రమంగా పెంచుకొంటూ వెళ్ళాలి. బాధలు, ఉద్రిక్తతలు మనస్సును చీకాకు పరచినప్పుడు ధ్యానమే శరణ్యం. మనస్సును ధ్యానంలో నిమగ్నం చేసి వాటి నుండి తాత్కాలిక నివారణనైనా పొందవచ్చును.

ధ్యాన స్థలం : నిశ్శబ్దంగా ఉండే ఏకాంతస్థలంలో కూర్చొని ధ్యానం చెయ్యాలి. ఇంట్లో ఒక మారుమూల గదిని దీనికోసరం ప్రత్యేకించుకోవడం మంచిది. పూజకోసం ప్రత్యేకించిన గదిలోనే జపధ్యానాది ఆధ్యాత్మిక సాధనలు చేయడం మంచిది. ధ్యానంలో పరిపూర్ణతను సాధించిన సిద్ధపురుషుల చిత్రపటాలను, దేవతల చిత్రపటాలను ధ్యానగదిలో గోడలకు తగిలించుకోవడం మంచిది. ఇది సాధకునికి ప్రోత్సాహాన్ని కలిగించి సాధనలో సులభంగా ముందుకు పోవడానికి తోడ్పడుతుంది. గదిలో దీపము, అగరవత్తులు వెలిగించి గది అంతా పవిత్రత, సువాసన నిండి ఉండేటట్లు చూచుకోవాలి. గదిలో

ప్రవేశించగానే పవిత్ర భావం కలిగి మనస్సు ప్రపంచ వాసనల నుండి దూరం వెళ్ళే విధంగా గది వాతావరణాన్ని ఉంచుకోవాలి.

ఆసనం : ధ్యానం చేసే ప్రదేశాన్ని మొదట శుభ్రం చేసుకోవాలి. ఎత్తు లేని చిన్న కఱ్ఱపీటను వేసుకొని దానిపైన దర్భచాపను పఱచి దానిపై మెత్తని బట్టను గాని, తివాచీని గాని పరచుకొని దానిపైన కూర్చోవాలి. సాధకునికి అనుకూలమైన ఎక్కువ సేపు కూర్చోగల సిద్ధాసనం గాని, పద్మాసనం గాని, సుఖప్రద ఆసనంలో కూర్చోవాలి.

ధ్యాన విధానం : మొదట ముమ్మారు ఓంకారాన్ని చెప్పి ఆపైన గురు పరంపర ప్రార్థన చేయాలి. తరువాత ఇష్టదేవతా ప్రార్థన చేసి నాడీ శుద్ధికి లఘు ప్రాణాయామం చేయాలి. ఈ విధంగా మనస్సును ధ్యానానికి ఆయత్తం చేసి ధ్యానం చేయాలి. ఓంకారాన్ని బిగ్గరగా ఉచ్చరిస్తూ ఆ నాదం మీద మనస్సును ఏకాగ్రం చేయాలి. మనస్సును అటూ ఇటూ పోనీకుండా ఓంకారోచ్చారణ మీదనే ఉంచాలి. ఓంకారాన్ని 16 పర్యాయాలకు తక్కువ కాకుండా ఉచ్చరించాలి. ఇది మనోలయానికి ఎంతగానో ఉపకరిస్తుంది. ఓంకారోచ్చారణను పెద్దగా ప్రారంభించి క్రమేణా తగ్గించి తగ్గించి నిశ్శబ్ద స్థితికి చేరుకోవాలి. ఆ శబ్దంపైన నిలచిన మనస్సు శబ్దం నిశ్శబ్దమవగానే తానున్న నిశ్చలమవుతుంది. ఈ నిశ్చలస్థితిలో కొంతసేపుండి మరల ఓంకారోచ్చారణ చేయాలి. ఈ ప్రణవోచ్చారణ "దీర్ఘఘంటా నినాదవత్' అన్నట్లు ప్రాచీన దేవాలయలలోని పెద్దగంటను కొట్టి ఆపగానే ఆ శబ్దం క్రమ క్రమంగా తగ్గుతూ వచ్చి లయమవుతునట్లు ఓంకారోచ్చారణ శబ్దం కూడా క్రమక్రమంగా తగ్గి లయం కావాలి.

పూజ్య శ్రీ స్వాములవారు నాల్గురకాల ధ్యానాలను గురించి వివరంగా తెలియజేశారు. 1.సగుణధ్యానం, 2.నిర్గుణ ధ్యానం, 3.శ్వాసపై ధ్యాస, 4.ప్రణవ ధ్యానం. అందు సగుణ ధ్యానం : మనస్సును భ్రూమధ్యంలోనో,

నాసికాగ్రంలోనో, హృదయ పద్మంలోనో నిలిపి అచట ఇష్టదేవతా రూపాన్ని ధ్యానించాలి. ఈ ధ్యానంలో ఇష్టదైవమూర్తి పాదాల నుండి ధ్యానం ప్రారంభించి శిరస్సు వరకు ప్రతి అవయవాన్ని స్పష్టంగా ధ్యానించాలి. ఆపైన పూర్తి మూర్తి చైతన్య రూపాన్ని ధ్యానించి ఆ తరువాత ఆయన యొక్క గుణాలను ధ్యానించాలి. గుణాలను చింతన చేయాలి. ఆఖరులో సగుణ మూర్తి తేజోస్వరూపాన్ని మాత్రమే నిలిపి తనను (ధ్యాతను), పరిసరాలను కూడ మరచి ఆ మూర్తిలోనే మనస్సు లయం కావాలి.

2. నిర్గుణ ధ్యానం : ఏలాటి రూపాన్ని కూడా భావించక పరబ్రహ్మ స్వరూపాన్ని – సచ్చిదానంద స్వరూప లక్షణాన్ని చింతన – ధ్యానం చేయాలి.

3. శ్వాసపై ధ్యానం : మన శ్వాస రోజుకు 2600 సార్లు మనలో ప్రవేశిస్తూ బయటకు వస్తూంటుంది. ఈ శ్వాస లోనికి ప్రవేశించి మరల బయటకు వచ్చేప్పుడు 'సోఽహం' అంటుంది. ఈ శ్వాసనే హంస అంటారు. ఈ సోఽహంను అది నోరు లేదుగాన నోటితో అనదు. అందుచే దీనిని అజపా అన్నారు. మనం పద్మాసనం గాని, సిద్ధాసనం గాని వేసుకొని కళ్ళు మూసుకొని మనస్సును ఈ శ్వాసపై నిలిపి దాన్ని గమనిస్తూ వుండాలి. సో ఽహం భావన గల్గి యుండాలి. ఇలా శ్వాసను గమనిస్తూ వుంటే శ్వాస రాకడపోకడలు క్రమేణా తగ్గుతూ వస్తాయి. మనస్సు నిశ్చల స్థితికి క్రమేణ చేరుకుంటుంది.

4. ప్రణవ ధ్యానం : దీర్ఘఘంటా శబ్దం వలె ప్రణవోచ్చారణను బిగ్గరగా ఉచ్చారణ ప్రారంభించి క్రమేణ తగ్గిస్తూ తగ్గిస్తూ చివరకు ఉచ్చారణ సమాప్తమై నిశ్శబ్దస్థితికి చేరుకోవాలి. దీనిపై మనస్సును నిలపాలి. ఓంకారోచ్చారణ నిశ్శబ్ద స్థితికి చేరుకున్నప్పుడు ఆ నాదం మీద ధ్యాసగల మనస్సున్ను చివరలో నిశ్చలమవుతుంది. ఆ నిశ్చలస్థితిలో కొంతసేపుండి మరల ప్రణవోచ్చారణ ప్రారంభించాలి. ప్రతిసారి పైన పేర్కొనిన విధంగా మనస్సును

ప్రణవ ధ్యానంలో నిలపాలి. ఇలా చేయగా చేయగా చిత్తవృత్తులు నిరోధింపబడి క్రమంగా అవి నశిస్తాయి. 'వృత్తిశూన్యం మనః కృత్వా న కించిదపి చిన్తయేత్" అన్నట్లు అప్పుడు ఏ ఆలోచనలను చేయక ఆ నిశ్శబ్ద బ్రహ్మంలో మనస్సును లయం చేయాలి. (ధ్యానాల విషయంలో శ్రీస్వాములవారు చాలా చాలా వివరణలనిచ్చి సాధకుల చేత సాధన చేయించారు. వాని వివరాలను ఇందులో నేను వ్రాయడం లేదు. కొంతమేరకే వ్రాయగలిగాను, రచయిత) ఈ ధ్యాన స్థితిలో నుండి బాహ్యస్థితికి వచ్చినపుడు చివరగా లోకానికి శాన్తి గలుగాలనే సంకల్పంతో శాన్తి మన్త్రాలను పఠించాలి అని చెప్పారు.

లెమ్ము! మేలుకానుము

– శ్రీ స్వామి వివేకానంద

Arise, Awake and stop not till the goal is reached. Arise, awake from this hypnotism of weakness. None is really weak. The soul is Infinite, omnipotent, omniscient, stand up, assert yourself. Proclaim the God within you, do not deny Him!

లెమ్ము ! మేలుకొనుము! గమ్యము చేరువఱకు నిలువకుము! లెమ్ము! ఈ దుర్బలత్వమను మైకమునుండి మేల్కాంచుము! మేల్కాంచుము! ప్రపంచములో యెవరును దుర్బలులు కారు. ఆత్మ అనంతము, సర్వశక్తి యుతము, సర్వజ్ఞము అయియున్నది. కాబట్టి లెమ్ము! నీ ఆత్మశక్తిని ప్రకటింపుము! నీలో నున్న దైవమును చాటుము! ఆతనిని యెన్నడును తిరస్కరింపకుము.

Scanned by CamScanner

కలగన్న సౌభాగ్యం - కైవల్య వైభోగం

- రచన : డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్

కీర్తన : కలగంటి కలగంటి

ఇప్పుడిటు కలగంటి, ఎల్ల లోకములకు
అప్పడగు తిరువేంకటాద్రీశు గంటి...... కలగంటి

అతిశయంబైన శేషాద్రి శిఖరముగంటి
ప్రతిలేని గోపుర ప్రభల గంటి
శతకోటి సూర్య తేజములు వెలుగగ గంటి
చతురాస్యు పొడగంటి - చయ్యన మేలుకొంటి.... కలగంటి

అరుదైన శంఖ చక్రాదులిరుగడ కంటి
సరిలేని అభయ హస్తమును గంటి
తిరు వేంకటాచలాధిపుని చూడగ గంటి
హరి గంటి గురుగంటి... కలగంటి

అన్నమయ్యగారు పద కవితాక్షర చిత్రంలో తనకు వచ్చిన కల, అందు తాను పొందిన దివ్యతత్త్వ దర్శనం పారవశ్యంతో గానం చేసి మరీ మనకందించాడు. సర్వ లోకాలకు అప్పడు అనగా తండ్రియైన తిరుమల శ్రీవారిని కలలో చూచాను. మహోన్నతమైన శేషాచలం శిఖరం కన్పించింది. సాటిలేని కాంతులను విరజిమ్మే గోపురాలను చూచాను. శతకోటి సూర్యులు ఒక్కమారుగా వెల్గొందుచుండగా చూచాను. చతుర్ముఖ బ్రహ్మ కన్పించాడు. అంతే వెంటనే మెలకువ వచ్చింది. స్వామికి ఇరుప్రక్కల శంఖ చక్రాలు,

సాటి లేని స్వామి అభయ హస్తమును చూచాను. శ్రీహరి, విశ్వగురువు, విశ్వదైవం అయిన తిరుల శ్రీవారిని కనులార కలలో చూచాను. అంటూ ఆ పరమ భాగవతుడు కైవల్య కారకమైన కల వృత్తాంతాన్ని కమనీయంగా అందించారు. నిజమైన కల, దివ్యమైన తిరుమల, భవ్యమైన శేషాచల వైకుంఠ ధామం.

సరిగ్గా యిలాగే "క్కనాక్కణ్డేన్‌తోళీనాన్" 'ఓ చెలీ! నేను కలగన్నాను" అంటూ గోదాదేవి "నాయ్చ్చియార్ తిరుమొళి" అనే రచనలో ఆరవ దశకమైన "వారణమాయిరమ్"లో మనోహరంగా పాశురగానం చేసింది. అన్నమయ్య అక్షర పరబ్రహ్మను, ఆయన నివాస వైభవాన్ని, ఆయన అభయహస్త దర్శన భాగ్యాన్ని వివరించగా, గోదాదేవి పరమాత్మతో తనకు వివాహ వైభవం జరగడాన్ని ముందుగా కలలో కాంచి తన చెలికత్తెకు చెప్పడం జరిగింది. అన్నమయ్య ఐహికంలో ఉండి పారలౌకిక ప్రపంచపు అంచులను తాకాడు. గోదామాత కలలో ఇహాన్ని మరచింది. పరములో జీవించింది. కల చెదరినా పరమును, పరంధాముడైన పరమాత్మను వీడలేదు. తన కలను నిజం చేసుకొంది. శ్రీరంగనాథుణ్ణి చేపట్టి మధుర పాశురగానంతోనే పరమాత్మ పరమ పదాలలో లీనమైంది. పన్నిద్దరాళ్వారులలో ఏకైక మహిళా ఆళ్వారుగా చరిత్రలో మిలిగింది. మనకు ఆధ్యాత్మిక స్ఫూర్తిని, భక్తి చైతన్య దీప్తిని, మాధవ సేవానిరతిని తెలియ చెప్పింది. ఆండాళ్ చరిత్ర చరితలను కొంత స్థూలంగా విన్నంత, కన్నంత, తెలియవచ్చినంత చూద్దాం.

గోదాదేవి, తమిళనాట శ్రీవిల్లి పుత్తూరులో శ్రీ భట్టనాథుడు ఈయనే పెరియాళ్వార్‌నకు తులసివనంలో దొరికిన బిడ్డ. బిడ్డలు లేని పెరియాళ్వార్ ఈ బిడ్డను సొంత పుత్రికగ భావించి "కోదై" అని పేరు పెట్టి పెంచారు. "కోదై" అనే పదమే కాలక్రమంలో 'గోదా' యైనది. పెరియాళ్వారు శ్రీవిల్లి పుత్తూరులోని వటపత్రశాయియైన భగవంతునకు నిత్యమాల కైంకర్యం చేసేవారు. పెరియాళ్వార్ మంచి విష్ణు భక్తుడు. భాగవతుడు. పరమ నిష్ఠా

పరుడు. బిడ్డయైన గోదాదేవిని కూడా భక్తి జ్ఞానాల ప్రబోధాలతోనే పెంచుతున్నాడు. అయితే స్వామికి తయారు చేసిన మాలను తండ్రి చూడకుండా గోదాదేవి యలంకరించుకొని, అద్దంలో చూచుకొని, తిరిగి వటపత్రశాయికి పంపుతోంది. కాని యిది పెరియాళ్వారునకు తెలియదు. కాని నిజం బయట బడాలి కదా! ఒకరోజు పూలమాలలో తలవెంట్రుకను గమనించిన పెరియాళ్వార్ చూచి, బిడ్డపై ఆగ్రహించాడు. ఆవేదన చెందాడు. అదేరోజు స్వప్నంలో వటపత్రశాయి పెరియాళ్వారునకు కన్పించి "భక్తుల ఆనందమే నాకానందం. భాగవతుల సంస్పర్శనం పరమపావనం. నీ బిడ్డ ధరించిన మాలే నాకు ప్రియం. నీవు ప్రశాంతత ప్రసన్నతలను కల్గియుండు" మని ఓదార్చి, ఊరడించి, అనునయించాడు. కాలం కరగుతోంది.

గోదాదేవిని శూడికొడుత్తనాచ్చియార్" తాను ధరించిన మాలను భగవంతునకు అర్పిస్తుందని పిలచుకొన్నారు. మన శ్రీకృష్ణదేవరాయలు వారు ఆ భావాన్నే సంస్కృతీకరించి 'ఆముక్తమాల్యద" అని అందంగా పేరు పెట్టారు గోదాదేవికి. గోదాదేవికి వయస్సు వచ్చింది. మనస్సు మాధవునిపై మరులు కొంది. "వటపత్రశాయియే శ్రీకృష్ణుడు. ఈ శ్రీకృష్ణుడే శ్రీరంగనాథుడు. నేను శ్రీరంగనాథునికే సతిని కావాలి" అని దృఢంగా సంకల్పించింది. సర్వకాల సర్వావస్థలందును స్వామి తలంపులతో పొద్దు పుచ్చుతోంది. తండ్రికి ఇది విద్దూరమై వేదన కల్గింది. మరలా స్వామియే గోదాదేవి తండ్రికి !! భట్టనాథా! దిగులుపడకు. నీ బిడ్డ కారణ జన్మరాలు. కలికల్మషాలనుండి మానవ సమాజాలను సంరక్షించడానికి నేను అర్చామూర్తినై అవతరించగా, నా పరివారం కూడా భువికి వివిధ రూపాలలో వచ్చారు. గోదాదేవి భూదేవి అంశ. నీవు గరుడుని అంశ. భక్తి ప్రపత్తులతో, నామసంకీర్తనలతో జీవాత్మలు తమతమ దోషాలను తొలగించుకోవాలి. అందుకు మీరందరూ భక్తిరస స్ఫూర్తిని కల్గించాలి. గోదాదేవిని నేనే చేపడతాను. శ్రీరంగానికి తీసుకొని రమ్ము" అని ఆదేశించాడు. భగవదాదేశాన్ని భట్టనాథుడు అనుసరించాడు.

ఇదొక లీల.

గోదాదేవి శ్రీరంగనిపై గల మధుర భక్తి స్ఫూర్తితో తిరుప్పావై – 30 పాశురములను, నాచ్చియార్ తిరుమొళి – 140 పాశురాలను గానం చేసింది. నాచ్చియార్ తిరుమొళిలో ఆరవదశకంలో గోదామాత కలగంది. తాను కన్న కలను తన ఇష్ట సఖికి చెప్పింది. మధుర భక్తి, పాశురగానం సమంగా జతబడి "వారణ మాయిరమ్"గా దర్శనమిచ్చింది. "కనాక్కణ్డేన్ తోళీనాన్" ఓ సఖీ! నేను కలగన్నాను. కల్యాణ గుణరూపుడైన శ్రీరంగనాథుడు వైభవంతో పురానికి విచ్చేశాడు. పుర ప్రజలు మంగళతోరణాలతో, పూర్ణకుంభాలతో స్వామికి స్వాగతం చెప్తున్నట్లు చూచాను. అంతేకాదు గోదారంగనాథుల వివాహానికి సుముహూర్తం నిర్ణయించారు. స్వామి కల్యాణపు పందిరికి విచ్చేసినట్లు ఒక యువకుడు "నరహరి, మాధవుడు, గోవిందుడు వచ్చాడని" ఉత్సాహంగా చెప్తుంటే విన్నాను. శ్రీకృష్ణుని దేవేరిగా నన్ను ఇంద్రాది దేవతలు చెప్పుకొంటూ వివాహ మంత్రాలతో ఆశీర్వదించారు. ఆడబిడ్డగా దుర్గతల్లి మంత్ర పూతమైన వస్త్రాన్ని, కల్యాణమాలను నాకు ధరింప చేసింది. పురోహితులు పవిత్ర జలాలతో, స్వస్తి వచనాలతో సంప్రోక్షించి, పూలమాలా లంకృతుడైన స్వామికి నాకు "కొప్పునాణ్" రక్షాబంధాన్ని కట్టారు. మగళవాద్యాలు మ్రోగుతుండగా స్వామి "కైత్తలమ్పత్త" పాణిగ్రహణం చేశాడు. బ్రాహ్మణుల వేదమంత్రాల మధ్య స్వామి నా చేతిని పట్టుకొని హెూమము చుట్టూ ప్రదక్షిణం చేశారు. సర్వజగద్రక్షకుడైన స్వామి తన శ్రీహస్తంతో నా పాదాన్ని పట్టుకొని, జాగరూకతతో "అమ్మి మితిక్క" సన్నేకలుత్రొక్కించాడు. "పొరిముకన్దు అట్టి" మేము పెండ్లి పందిరిలో సోదరుల సాయంతో లాజహోమం చేశాం. మంగళార్థం ఏనుగుపై మేము ఇద్దరం ఊరేగాము. ఆ తరువాత "మంగన మాట్ట" మంగళ స్నానం చేయించారు. ఇలా పూసగ్రుచ్చినట్లు పదిపాశురాలలో గోదామాత కలగన్న విధానాన్ని వివరించింది. వివాహ క్రతు విధులను ఆవిష్కరించింది. వైవాహిక నీతిని

Scanned by CamScanner

చాటింది. ఇది పిచ్చా, పిచ్చి భక్తియా! అంటే కానేకాదు. జీవాత్మ పరమాత్మ పరిష్వంగంకై పడే తపన. ఆరాటం. భక్తియోగానికి పరాకాష్ఠ. దృశ్య ప్రపంచం అబద్ధం. నిజ ప్రపంచం అదృశ్యం. మనోబుద్ధులు ఆత్మలో లయమైతే పరమ పదం గోచరిస్తుంది. లయం కావడం అంటే మనస్సు వ్యాపారం, బుద్ధి వ్యాపారం ఆగిపోవాలి. నేను అన్న ఆత్మను భక్తిసాయంతో పరమాత్మకు చేరువగా ఉంచగల్గాలి. అదే గోదామాత చేసింది. ఈ భావనల నిజానికి ఋజువు ఆత్మ -పరమాత్మలే. ఈ యిద్దరూ అదృశ్యులే కదా!

"తిరుప్పావై" ద్వారా వ్రతం - నియమం- నియతి-నీతి- అను భూతులకు మార్గం దొరికింది. 27వ పాశురగానం నాటికి "కుడారై" స్వామితో ఆత్మ పరమాత్మ సుజ్ఞానామృతాన్ని ఆస్వాదించింది. 30వ పాశురం పూర్తయింది. స్వామి పాదాలలో తల్లి లీనమైంది.

నిజమైన కల, ఋజువైన కథ, ఆండాళ్ అంటే కాపాడగల్గింది. కాపాడడానికి వచ్చింది. దేనినీ జీవాత్మలను, భక్తిదారులలో పయనించుమని ప్రబోధించింది. పండ్రెండు మంది ఆళ్వారులలో ఆండాళ్ ఆళ్వార్ మార్గం ప్రత్యేకం. పరమపావనం. పరిపూర్ణ ఆధ్యాత్మిక యోగం. మధుర భక్తి వైభోగం. అఖండ చిన్మయానందం. పాశురగానం అద్వైత సిద్ధికి అమరత్వ లబ్ధికి మూలమైంది. ముక్తినిచ్చిన మహాభక్తి యోగమైంది. అనుభవైక వేద్యమైన దివ్య యోగమిది.

ధనుర్మాసం ధర్మానికి, దానానికి, దైవ భక్తికి, పుణ్య క్రతువులకు నెలవైంది. హరికథలకు, హరిదాసులకు కొలువైంది. భాగవత దర్శనం, స్పర్శనం పాపనాశం. భాగవతుల సాంగత్యం పుణ్యప్రదం. శుభావహం. గోదాదేవి చరిత చరిత్రలో మనకందించిన సత్య సందేశమిదే. అందుకే రామానుజులవారు ఆండాళ్ తల్లిని ఆడపడుచుగా భావించి, ఆదర్శంగా తీసుకుని వైష్ణవ మత సిద్ధాంతాలను ప్రచారంచేసి ధన్యులయినారు. అలాంటి వారి సంస్మరణే మనకు మహద్భాగ్యం కదా!

ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము

" దివ్యజీవన సంఘము"నకు చెందిన " యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ " 94వ యోగవేదాంత తరగతులను 01-03-2020 నుండి 29-04-2020వ తేదీ వరకు రెండు మాసముల కొరకు నిర్వహింప నున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందాశ్రమ ప్రాంగణము నందు జరుగును. 20 నుండి 65 సంవత్సరముల మధ్య వయస్సు గల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్ల భాషయందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసి యుండవలయును. శిక్షణ, వసతి, భోజనములు ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేది 15-01-2020. ఈక్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. మఱియు www. Sivanandaonline.org website నుండి కూడా పొందవచ్చును. e-mail : Yoga@dlshg org.

Address
The Registrar,
The Yoga Vedanto,
Forest Academy,
The Divine Life Society,
Sivnandanagar - 249192\
Tehri Garhwal District (Uttarakhand)

ఇట్లు
Swami yogavedantanand
The Registrar,Yoga
Vedanta Forest Academy,

Scanned by CamScanner

ఎత్తి పాడుము - కంఠము ఎత్తిపాడు

- శ్రీ స్వామి వివేకానంద

మినుకుమినుకను చీకటిన్ మీద మీద !
నలముచుండెను కొరవిదయ్యంబుపగిది!
దనరు నజ్ఞానమును బాపికొనుము వేగ !
జననమరణమ్ములకు లాగికొనుచునేగు !
జీవితపుతృష్ణ నార్పుము శీఘ్రముగను!
తన్నుదా గెల్చునట్టివా డన్ని గెల్చు
దీని దెలియుము లొంగకు దెనికింక !!

అవనిజల్లిన దెద్దియో అదియె పండు ।
కారణంబును బట్టియే ।కార్యముండు।
చెడ్డ చెడ్డకును మంచి మంచికిని గల్గు ॥
దీని తప్పించుకొనుటకు తెరువులేదు.
రూపుతో బంధనంబుండు రూఢముగను
అన్నిటిని మీరియున్నది యాత్మగాన ।
ఆత్మకును రూపనామధేయములు లేవు ।
అదియె నీవనుభావంబు మదినెఱింగి ॥

ఉండునదియెల్ల దానయై యొక్కటుండు ।
నాతడే జ్ఞాతముక్తుండు నాత్మయతడే ।
ఆతనికి నొక్క మాయదానలరుచుండు ।
కలలనెన్నియొ యద్దియే కనుచునుండు ।
గాని యాయాత్మ సాక్షియై కాంచుచుండు।
నదియె నీవను సత్యంబు మదినెరింగి ॥
ఎత్తి పాడుము కంఠము ఎత్తిపాడు ।
యతివరా ధీర ఓమ్ తత్సదనుచు పాడు ॥

నేనెరిగిన శ్రీరమణ భగవాన్

- డా॥ కె.సుబ్రమణియన్

భగవాన్ దినచర్య ఎప్పుడూ ఒకలాగానే వుండేది. రోజులో చాలా కాలం పాటు మహర్షి మౌనంగా వుండేవారు. అప్పుడప్పుడు భక్తుల వైపు చూస్తూ వుండవచ్చు. లేదా తమ కళ్ళకు సూటిగా ఎక్కడో అనంతంలోనికి చూస్తుండేవారు. ప్రతిరోజూ వచ్చిన వార్తాపత్రికలను వారి ముందు వుంచేవారు. వాటిని కొంతసేపు చదివేవారు. భగవాన్ హాలులో వార్తాపత్రికలు చూస్తున్నప్పుడు నాకు కొన్నిసార్లు, ఆయనకు వార్తాపత్రికలు చదవాల్సిన అవసరం ఏముంది? దేశంలోనూ, ప్రపంచంలోనూ జరిగే విషయాలను క్రొత్తగా తెలుసుకునే అవసరం ఏముంది? ఆయనకు తెలియనిది ఏముంది, అని అనిపించేది. కొన్ని ఏళ్ళ తరువాత గాని నాకు ఈ విషయం అర్థం కాలేదు.

మనలో ఒకరు :

తాము మనందరికంటే భిన్నమైన వారన్న అభిప్రాయాన్ని మనలో కలిగించడం ఆయనకు ఇష్టం లేదు. మనం నిత్యజీవితంలో నిర్వర్తించేవే తామూ చేస్తున్న అభిప్రాయాన్ని కలిగించడమే వారి ఉద్దేశం. చాలాసేపు సోఫాపై కాళ్ళు జాపి కూర్చునేవారు. అప్పుడప్పుడు కూర్చునే భంగిమను మార్చేవారు. కొన్ని సమయాల్లో తల కొద్దిగా వణుకుతుండేది. లేదా పక్కకు వాలి వుండేది. నిటారుగా కూర్చున్నప్పుడు ఒక విగ్రహాన్ని చూస్తున్నట్లు అనిపించేది. అలాంటప్పుడు చలనం లేకుండా భూమి మీదికి శివుడు దిగివచ్చినట్లుగా అనిపించేది. స్వయంగా ఆయన శివుడేనన్న భావన కలిగేది. ఆ రోజుల్లో వార్తాపత్రికలు మద్రాసునుండి ఒక పై కవరులో వుంచబడి వచ్చేవి. తాము చదివిన తరువాత పత్రికలను శుభ్రంగా మడిచి తిరిగి ఆ కవర్లలో వుంచి ఆశ్రమ ఆఫీసుకు పంపేవారు.

మధ్యాహ్నాము, రాత్రి భోజనానికి ముందు మహర్షి ఒక రెండు నిమిషాలపాటు బయట కొద్దిగా నడిచి వచ్చేవారు. గోశాలకు వెళ్ళి కాస్త ఆగి తిరిగి వచ్చేవారు. మహర్షి ఎప్పుడూ, ఏ కాలంలో నైనప్పటికి పాదరక్షలు ధరించేవారు కాదు. వెంట వెళ్ళే పరిచారకులు, ఇతరులు మాత్రం చెప్పులు తొడుక్కునేవారు. తిరువణ్ణామలైలో వేసవి చాలా తీవ్రంగా వుంటుంది. బండల మీద పాదరక్షలు లేకుండా నడవడం అసాధ్యం. తమకు పాదరక్షలు లేనప్పటికీ, నెమ్మదిగా నడుస్తూ వెంట వచ్చేవారికి మీరెందుకు ఎండలో బాధపడతారు, తొందరగా నడచి వెళ్ళండని అనేవారు. హాలులో వున్నంతకాలం భగవాన్ పాదాలను తాకే ధైర్యం ఎవరూ చేసేవారు కాదు. కాని వారు బయట నడుస్తున్నప్పుడు అప్పుడప్పుడు భక్తులు వారి పాదాలకు నమస్కరించేవారు. కొన్ని సమయాల్లో పాదాలను విడువక ఏడుస్తున్నప్పుడు వారిని ఎంతో కృపతో చూస్తూ ఇక చాలు అంటూ ముందుకు సాగేవారు.

- (శ్రీరమణజ్యోతి సౌజన్యంతో).

Scanned by CamScanner

వార్తలు

(01). డిశంబరు 2వ తేది సోమవారం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి మూర్తికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పండ్లరసములతో అభిషేకం చేయబడినది. ఆ తరువాత శ్రీగంధస్నానము, విభూతిస్నానం చేయబడినది. శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి సహస్రనామార్చన జరిగినది. శరవణభవ నామస్మరణ, సుబ్రహ్మణ్య స్తోత్రపారాయణలు జరిగాయి. వివిధ పదార్థాలతో నైవేద్యం పెట్టబడి భక్తులకు అన్న సంతర్పణ జరిగినది.

(02). 7-12-2019 తేది శనివారం గీతాజయన్తి సందర్భంగా శ్రీశుకబ్రహ్మాశ్రమంలో సమష్టి సంపూర్ణ భగవద్గీత పారాయణానంతరము శ్రీమద్భగవద్గీతకు, శ్రీకృష్ణ పరమాత్మకు అర్చనలు జరిగి నైవేద్య సమర్పణానంతరం భక్తులకు భిక్ష పెట్టబడినది.

(03). గీతాజయన్తి నాడు (1970 సం॥) తిరుపతి శ్రీమలయాళ సద్గురు సేవా సమాజం పూజ్య శ్రీ విమలానందస్వాములవారిచే (శ్రీ వ్యాసాశ్రమ ప్రథమ పీఠాధిపతులు) ప్రారంభింపబడి నందు వలన 7-12-2019 నుండి మూడు రోజులు, గీతాజయన్తి మఱియు సమాజ 49వ వార్షికోత్సవం శ్రీ మలయాళ సద్గురు సేవాసమాజం (తిరుపతి)లో జరిగినది. ఈ సందర్భంలో శ్రీకృష్ణ భగవానునికి చాలా విశేష అలంకారం చేయబడినది. మూడురోజులలో ఒకరోజు శ్రీమలయాళస్వామి పూజ, ఒకరోజు గీతాపూజ, ఒకరోజు శ్రీకృష్ణ భగవానుని పూజ జరిగినది. మూడురోజులు ఉదయం, సాయంకాలములలో మహాత్ముల, పండితుల ప్రవచనలు జరిగాయి. రోజూ కార్యక్రమంలో స్థానికులు 200 మంది పాల్గొనినారు. ఆఖరు రోజు తిరుపతి పాఠశాలలో సమాజం జరిపిన గీతాపోటీలలో ప్రథమంగా వచ్చినవారికి మెడల్స్ బహుమతిగా ఇవ్వబడినవి.

(04). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో నవంబరు నెలలో ఓ.పి. విభాగంలో **549** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. **51**మందికి కళ్ళలో పొరలు తీసివేసి లెన్సు అమర్చబడినవి. **2** మందికి యాగ్ లేజర్ చికిత్స చేయబడినది. **4** గ్రామాలలో కళ్ళ వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.

శ్రీమలయాళ సద్గురు సేవాసమాజ (తిరుపతి) వార్షికోత్సవంలో ప్రవచనాలు

గీతా పోటీల బహుమతి ప్రదానం

Scanned by CamScanner

Regd.No. TRP / 123 / 2018 - 20 January 2020 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-12-2019, Permitted to post : 29th, 30th every month.



శ్రీశుకబ్రహ్మాశ్రమ శివాలయంలో కార్తీక దీపాలు

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

Scanned by CamScanner